అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- మంత్రి జోగి రమేష్
- చోడవరం, దావోజీపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం
- చోడవరంలో రూ.30 లక్షలతో ఇంటింటికీ కుళాయిలు
- రూ.12 లక్షలతో రెండు సీసీ రోడ్ల నిర్మాణానికి హామీ



చోడవరంలో అనారోగ్యంతో బాధపడుతున్న వలంటీర్ భర్త దాసి తాతారావును పరామర్శించి ధైర్యం చెబుతున్న మంత్రి జోగి రమేష్

పెడన: కుల, మతాలు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా అర్హులందరికి సంక్షేమ పథకాలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. అందరికీ మంచి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరిచిపోకుండా మరోసారి ఆశీర్వదించాలని కోరారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మండల పరిధిలోని చోడవరం, దావోజీపాలెం గ్రామంలో శనివారం నిర్వహించారు. మంత్రి ఇంటింటికి వెళ్లి వారు పొందిన పథకాల లబ్ధిని వివరించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చోడవరం గ్రామంలో మెయిన్‌రోడ్డు అభివృద్ధితోపాటు గాంధీనగరం రోడ్డు, పాత దళిత వాడ రోడ్డు నిర్మించాలని స్థానికులు మంత్రిని కోరగా గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా వచ్చే నిధులతో వాటిని నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించాలని సిబ్బందిని ఆదేశించారు. సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

- అర్జ అరుణ తనకు దేవరపల్లిలో రేషన్‌కార్డు ఉందని, ఇళ్ల స్థలం మంజూరు చేయాలని కోరగా.. ఈమెకు ఇంటి స్థలం మంజూరుకు ఏ ఏ పత్రాలు కావాలో ఇప్పించి, ఇళ్ల స్థలం మంజూరుకు చర్యలు తీసుకోవాలని వీఆర్వోను మంత్రి ఆదేశించారు.
- కాగిత కవిత తాగునీటి ట్యాప్ మంజూరు చేయాలని కోరగా, జల్ జీవన్ మిషన్ పథకం కింద రూ. 30 లక్షలు చోడవరం పంచాయతీకి మంజూరయ్యాయని, త్వరలో ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్లు ఇస్తామని మంత్రి తెలిపారు. టెండర్లు పిలిచి త్వరలో పనులు ప్రారంభించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. ఈలోగా ప్రజలు ఇబ్బందులు పడకుండా అవసరమైన చోట్ల పబ్లిక్ కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేయాలని సూచించారు.
- క్యాన్సర్ బాధితుడు ఎద్దు శ్రీనివాసరావును మంత్రి జోగి రమేష్ పరామర్శించారు ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేయిస్తున్నామని కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రభుత్వ పరంగా సాయం అందించేలా చర్యలు తీసుకోవాలని పీఏకి, వైద్య సిబ్బందికి సూచించారు.
- బోదకాలు ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న వృద్ధురాలు చలమలశెట్టి లక్ష్మీకుమారిని మంత్రి పలుకరించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈమెను ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయించాలని వైద్య సిబ్బందికి, వలంటీర్‌కు సూచించారు. చోడవరంలో అనారోగ్యంతో బాధపడుతున్న వలంటీర్ భర్త దాసి తాతారావును మంత్రి పరామర్శించి ధైర్యం చెప్పారు.
- చోడవరం గ్రామంలో వైఎస్సార్ పింఛను కానుక పథకం కింద 1,036 మందికి ప్రతి నెలా పింఛన్లు అందిస్తున్నామని, 2023–24 ఏడాదికి రైతు భరోసా కింద 395 మంది రైతులకు రూ.22 లక్షలు, అమ్మ ఒడి కింద 56 మందికి రూ.7.28 లక్షలు, జగనన్న తోడు పథకం ద్వారా 34 మందికి రూ.3.40 లక్షలతో పాటు పలు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని మంత్రి వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజులపాటి వాణి, పెడన మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ గరికపాటి చారుమతి, కొండవీటి నాగబాబు, అచ్యుతరావు, గరికపాటి రామానాయుడు, సర్పంచ్ సుధా, ఎంపీడీఓ రెడ్డయ్య, ఎంపీటీసీ అనిల్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం పరిశీలన



గూడూరు: జగనన్న గోరుముద్ద పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పోషకాహారం అందిస్తున్నామని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు అన్నారు. చిట్టిగూడూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం జగనన్న గోరుముద్ద పథకాన్ని జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబుతో కలిసి ఆయన పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పర్లం పెదబాబు, ఎంపీటీసీ సభ్యుడు జక్కా ధర్మారాయుడు, గూడూరు పీఏసీఎస్ డైరెక్టర్ వేము ఆనంద్, లంకా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

జగనన్న భూ రక్షలో సర్వే రాళ్లు ఏర్పాటు

కృత్తివెన్ను: రాష్ట్ర ప్రభుత్వం రైతుల భూములకు నిర్దిష్టమైన హద్దులు ఏర్పాటు చేయడంలో భాగంగా జగనన్న భూ రక్ష పేరుతో భూముల రీ సర్వే చేసింది. దీనిలో భాగంగా కృత్తివెన్ను మండలంలో రీసర్వే పూర్తయిన యండపల్లి, నీలిపూడి, కోమాళ్లపూడి, మాట్లం, చందాల గ్రామాలలో శనివారం సర్వే రాళ్లు ఏర్పాటు చేశారు. ఈ ఐదు గ్రామాల్లో 4,700 ఎకరాలలోని భూములకు రాళ్లు పాతనున్నట్లు తహసీల్దార్ రామకోటేశ్వరరావు తెలిపారు. మండల సర్వేయర్ ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వో మరియదాసు మృతికి సంతాపం



కోడూరు: మండలంలోని పిట్టల్లంక వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న వాకా మరియదాసు (55) అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. మరియదాసు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడలోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆరోగ్యం విషమించడంతో శనివారం ఉదయం మరియదాసు మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని స్వగ్రామం నాగాయలంక మండలం పెదపాలెం గ్రామానికి తరలించారు. ఆయన మృతికి తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా, ఆర్‌ఐ సుభాషిణి, వీఆర్వోలు, సిబ్బంది సంతాపం తెలిపారు.

ఆర్థిక సాయం

మంగళాపురం(చల్లపల్లి): మంగళాపురం గ్రామానికి చెందిన పీఏసీఎస్ సభ్యుడు రైతు గొరిపర్తి శ్రీనివాసరావు ఇటీవల మృతిచెందాడు. సొసైటీ ఆధ్వర్యంలో రూ.10 వేలను మృతుని భార్య గొరిపర్తి నాగ కోటేశ్వరమ్మకు పీఏసీఎస్ చైర్మన్ పేరం నాగిరెడ్డి శనివారం అందచేశారు. సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పాఠశాలకు బల్లలు అందజేత

బంటుమిల్లి: నాగన్న చెరువు పంచాయతీ శివారు నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన అప్పికట్ల సామ్రాజ్యం జ్ఞాపకార్థం కుమారుడు కనకరాజు సుమారు రూ.15 వేలు విలువ చేసే ఉపాధ్యాయులు వినియోగించే బల్లలను బహూకరించారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామపెద్దలు శ్రీనివాసరావు, అబ్రహాం తదితరుల చేతుల మీదుగా హెచ్‌ఎం కాశీవిశ్వేశ్వరరావుకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు విస్తరించాలి

మచిలీపట్నంటౌన్: స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాలను మరిన్ని నిర్వహిస్తూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని మచిలీపట్నం తహసీల్దార్ శ్రీవిద్య అన్నారు. తులసీ హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శనివారం పోర్టురోడ్డులోని శిశు గృహ చైల్డ్ హోమ్‌లోని పిల్లలకు పాలపౌడర్లను ఆమె అందజేశారు. ఆమె మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు కృషి చేస్తుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ అధ్యక్షుడు తులసీరామ్, వెలుగు ఫౌండేషన్ అధ్యక్షుడు నంగేగడ్డ బాబు, ఆర్గనైజేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మెరుగు పడిన డ్రెయిన్లు



కొంకేపూడి వద్ద లజ్జబండ డ్రెయిన్‌లో పేరుకుపోయి గుర్రపు డెక్క (నాడు)



గుర్రపు డెక్క, తూడు తొలగింపుతో తాజా పరిస్థితి (నేడు)

పెడన: మండలంలోని లజ్జబండ డ్రెయిన్, ఇసుకపర్ర డ్రెయిన్‌లో గుర్రపు డెక్క, తూడు పేరుకుపోయింది. ఇటీవల కురిసిన అధిక వర్షాలకు పంట పొలాల్లో నీరు బయటకు పోకుండా గుర్రపు డెక్క అడ్డుగా ఉందని రైతులు ఆందోళన చెందారు. రైతులు పడుతున్న ఇబ్బందులను రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ దృష్టికి స్థానిక నాయకులు తీసుకువెళ్లడంతో తక్షణమే గుర్రపు డెక్క తొలగింపునకు చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. దీంతో లజ్జబండ డ్రెయిన్, ఇసుకపర్ర డ్రెయిన్‌లో గుర్రపు డెక్క, తూడు తొలగించడంతో మురుగునీరు సజావుగా పారుతోంది.



పెనుమల్లి గ్రామ సమీపంలో ఇసుకపర్ర డ్రెయిన్‌లో గుర్రపు డెక్క, తూడు (నాడు)



పెనుమల్లి గ్రామ సమీపంలో ఇసుకపర్ర డ్రెయిన్‌లో గుర్రపు డెక్క, తూడు తొలగించిన తరువాత పరిస్థితి (నేడు)

ఓటర్ల సవరణ జాబితా తయారీకి సహకరించండి

ఆర్డీఓ కిశోర్



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీఓ కిశోర్

చిలకలపూడి(మచిలీపట్నం): డివిజన్ పరిధిలో ఓటర్ల సవరణ జాబితా తయారీకి సహకరించాలని బందరు ఆర్డీఓ ఐ. కిశోర్ అన్నారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ మచిలీపట్నం నగరంలో 83,596 గృహాలు ఉండగా ఇప్పటి వరకు 52,734 గృహాల సర్వే పూర్తి చేశామన్నారు. మొత్తం 1,87,302 మంది ఓటర్లు ఉండగా ఇప్పటివరకు 1,14,159 మంది ఓటర్ల వివరాలను తాము పరిశీలించామని చెప్పారు. మచిలీపట్నం నగరంలోని 201 పోలింగ్ బూత్‌లలో 5,361 మంది ఓట్లు పోలింగ్‌బూత్‌లు మార్పులు ఉన్నాయని గుర్తించామన్నారు. నగరంలో కొత్తగా ఓటర్ల నమోదు కోసం 1,676 దరఖాస్తులు, వివిధ ప్రాంతాల్లో ఓట్లను తొలగించాలని 1,406 దరఖాస్తులు వచ్చాయన్నారు. మార్పులు, చేర్పుల కోసం 3,434 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. ఇంకా ఏమైనా మార్పులు, చేర్పులు, బదిలీ అయినవారు, వలస వెళ్లిన వారు ఉంటే తమకు తెలియజేస్తే ఆ వివరాలను పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదా మాట్లాడుతూ కొత్త ఓటర్ల నమోదుపై దృష్టి సారించాలన్నారు. కళాశాలల యాజమాన్యాలతో మాట్లాడి విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించి ఓటరుగా నమోదయ్యేలా చూడాలని ఆర్డీఓకు సూచించారు. సమావేశంలో బందరు మునిసిపల్ కమిషనర్ చంద్రయ్య, తహసీల్దార్ శ్రీవిద్య, ఏసీపీ నాగమల్లేశ్వరరావు, వివిధ పార్టీల నాయకులు లింగం ఫిలిప్, కొట్టె వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నారు సర్దుబాటు...!

- బాగున్న వెద సాగులోని నారును... దెబ్బతిన్న వెదసాగు పంటకు తరలింపు
- నారు కోసం దూరాభారమైనా తెచ్చేందుకు పయనం

పెడన: ఆరు గాలం కష్టపడే రైతన్నను అధిక వర్షాలు దెబ్బతీశాయి. రైతాంగం ఖర్చులు తగ్గించుకునేందుకు ఈ దఫా వెదసాగును ఆశ్రయించారు. అధిక వర్షాలతో వెదసాగులో నారు చాలా చోట్ల పూర్తిగా కుళ్లిపోగా మరికొన్ని చోట్ల పాక్షికంగా దెబ్బతింది. ఇంకొన్ని చోట్ల బ్రహ్మాండంగా ఉంది. దెబ్బతిన్న రైతులు కొత్తగా విత్తనాలు కొనుగోలు చేసి ఆకుమడి వేస్తే పంట పండే సమయం జాప్యం ఏర్పడుతుందని, పంట దిగుబడి ఉండదనే ఆలోచనతో విత్తనాలు జోలికి పోవడం లేదు. నారు కోసం విశ్వప్రయత్నం చేస్తూనే ఉన్నారు. నారు దొరికితే నాట్లు వేసుకునే దిశగానే రైతాంగం అడుగులు ముందుకు వేస్తోంది. చివరకు వెదసాగు పంట బాగున్న చోట నుంచి నారును పలుచగా వేసుకుందామని ఆలోచన చేస్తూ దెబ్బతిన్న పంటలకు నారును తరలించి పలుచగా నాట్లు వేస్తున్నారు. అదే విధంగా బాగా తెలిసిన వారుంటే ఐదారు పోగులను సర్దుబాటు చేస్తున్నారు. పూర్తిగా దుక్కిదున్ని దూరభారమైనా నారును కొనుగోలు చేసి నాట్లు వేసుకుంటున్నారు. వెదసాగులోని నారును పలుచగా తీసుకుని మిగిలిన చోట్లకు తక్కువ పోగులతోనే నాట్లు వేస్తూ సర్దుబాటు చేస్తున్నారు. వర్షాలు పడుతుండటం, మరో పక్క కాలువలు ద్వారా నీటిని కూడా విడుదల చేయడంతో రెండు, మూడు రోజుల్లో మళ్లీ పూర్తిస్థాయిలో పంటలకు సాగునీరందేలా పాలకులు చర్యలు తీసుకున్నారు.

దమ్ము ట్రాక్టర్లను రహదారులపై నడిపితే కఠిన చర్యలు

ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్ హెచ్చరిక

కోడూరు: వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా దమ్ము ట్రాక్టర్లను రహదారులపై నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్ హెచ్చరించారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ట్రాక్టర్ల యజమానులతో ఎస్‌ఐ ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పొలంలో దమ్ము చేసేందుకు ట్రాక్టర్‌కు ఏర్పాటు చేసే వీల్స్ వల్ల రహదారులు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. వీల్స్‌కు తప్పనిసరిగా రబ్బర్ తొడుగులను ఏర్పాటు చేసుకోవాలని ఎస్‌ఐ అన్నారు. వీల్స్ పదునుగా ఉండడం వల్ల రహదారి మధ్యలో గాడి ఏర్పడి రోడ్డు త్వరగా ధ్వంసమవుతుందని చెప్పారు. రబ్బర్ తొడుగులు లేకుండా రోడ్లపైకి వచ్చే దమ్ము ట్రాక్టర్లను సీజ్ చేయడంతో పాటు భారీ మొత్తంలో జరిమానా విధిస్తామని ఎస్‌ఐ హెచ్చరించారు. ఏఎస్‌ఐ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

దివిసీమలో పలుచోట్ల భారీ వర్షం

- ఈదురు గాలులకు కోడూరులో నేలకొరిగిన కొబ్బరిచెట్టు
- తప్పిన ప్రమాదం



కోడూరులో ఈదురు గాలులకు విద్యుత్ వైర్లపై పడిన కొబ్బరి చెట్టు

అవనిగడ్డ/కోడూరు: దివిసీమలో శనివారం పలు చోట్ల భారీ వర్షం కురిసింది. నాగాయలంక, చల్లపల్లి, కోడూరులో ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. కోడూరులో అకస్మాత్తుగా వీచిన ఈదురు గాలులకు ఐదో వార్డులోని వీఆర్‌ఓ కార్యాలయం ఎదురుగా ఉన్న కొబ్బరిచెట్టు విరిగి విద్యుత్ వైర్లపై పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న విద్యుత్ సిబ్బంది వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపి వేయడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. కొబ్బరి చెట్టు విద్యుత్ తీగలపై పడటం, ఆ సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. అనంతరం విద్యుత్ శాఖాధికారులు చెట్టును తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

రైతులకు ఊరట..

సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఈ వర్షం ఊరట నిచ్చింది. గత పది రోజుల నుంచి వర్షాలు లేకపోవడంతో ఎండిపోతున్న వరి పొలాలకు ఈ వర్షం ఊపిరి పోసినట్టయింది. నాగాయలంకలో 62.8 మి.మీ వర్షపాతం నమోదుకాగా, చల్లపల్లిలో 54.7, అవనిగడ్డలో 38.6, కోడూరులో 32.4, మోపిదేవిలో 31.5, ఘంటసాలలో 30.6 మి.మీ వర్షపాతం నమోదైంది. పది రోజుల తరువాత వర్షం కురవడంతో వరిసాగు పనులను రైతులు ముమ్మరం చేశారు. పొలాల్లో వర్షం నీరు చేరడంతో నాట్లు వేసేందుకు ట్రాక్టర్లతో దమ్ము పనులు చేయించుకున్నారు. దీనికి తోడు పంట కాలువలకు సాగునీటి సరఫరా పెంచడంతో వ్యవసాయ పనులను వేగవంతం చేశారు.

మురుగు పోయేందుకు తూములు ఏర్పాటు



జేసీబీతో ఏర్పాటు చేస్తున్న తూములు

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మండల పరిధిలోని లంకపల్లి ఇందిరా కాలనీలో వర్షం నీరు పోయేందుకు గండి కొట్టిన ప్రాంతంలో అధికారులు తూములు ఏర్పాటు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ ప్రాంతంలో వర్షం నీరు నిలవడంతో మురుగు పోయేందుకు పంచాయితీ సిబ్బంది రోడ్డుకు గండికొట్టారు. దీంతో విద్యార్థులు, ద్విచక్ర వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సర్పంచ్ డి. విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ నేత పద్మారావు జేసీబీని ఏర్పాటు చేసి తూములు వేయించారు. ఎంపీడీఓ కేవీ సుబ్బారావు, ఈఓ బి. అర్జునరావుతో మాట్లాడి వీటిని ఏర్పాటు చేశారు. మురుగు పోయేలా శాశ్వత పరిష్కారం చేయించిన సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపీడీఓ సుబ్బారావుకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

బాధితులకు ఆర్థిక సాయం

మెరకనపల్లి(మోపిదేవి): మండల పరిధిలోని మెరకనపల్లికి చెందిన పామర్తి ప్రసాద్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జనసేన పార్టీ నాయకులు చందాల ద్వారా వసూలు చేసిన రూ. 90 వేలను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ చేతుల మీదుగా మృతుని తల్లి జాన్సీకి అందించారు. ఇదే గ్రామంలో మరో బాధితుడు శీలం శివకృష్ణకు మరో రూ. 10 వేలు అందించారు.

నేడు పెడనలో శాంతి ర్యాలీ

పెడన: మణిపూర్ హింసాత్మక చర్యలను నిరసిస్తూ పెడన పట్టణంలో ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహిస్తామని జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు శనివారం తెలిపారు. స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ పెడన నియోజకవర్గం క్రైస్తవులు, పెడన మండల ఫెలోషిప్, హైందవ, క్రైస్తవ, ముస్లింల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు శ్యాంతి ర్యాలీ ప్రారంభమవుతుందని చెప్పారు. ర్యాలీని పార్టీలకు అతీతంగా నిర్వహిస్తున్నామన్నారు. కృష్ణా జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు అయూబ్ ఖాన్, పాస్టర్లు ఎన్. డానియేల్, పిడిగే శామ్యూల్, ఎస్. ఇశ్రాయేలు, జాన్‌విల్సన్, మార్కు రాజు, వైఎస్సార్ సీపీ నాయకుడు కోడూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఓటరు జాబితా స్వచ్ఛీకరణే లక్ష్యం

గూడూరు: ఓటరు జాబితాల్లో తప్పులు లేకుండా స్వచ్ఛీకరణే లక్ష్యంగా ఎన్నికల కమిషన్ ఓటరు జాబితా పరిశీలనకు శ్రీకారం చుట్టిందని పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి కె.రాజ్యలక్ష్మి అన్నారు. శనివారం గూడూరు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన రాజ్యలక్ష్మి ఓటరు జాబితా పరిశీలనలో పురోగతిని బూత్‌ల వారీగా సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ పోలింగ్ బూత్ పరిధిలోని 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడికి తప్పనిసరిగా ఓటు హక్కు కల్పించాలన్నారు. అదే సమయంలో చనిపోయిన వారి ఓట్లను క్షుణ్ణంగా విచారణ చేసి జాబితాల నుంచి తొలగించాలని చెప్పారు. బీఎల్ఓలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.విజయప్రసాద్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

పెడన: హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ సూపర్‌వైజర్ బడుగు రాకేష్ అన్నారు. అంతర్జాతీయ యువజనోత్సవాన్ని పురస్కరించుకుని హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై స్థానిక భట్ట జ్ఞానకోటయ్య జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నివారణ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో రాకేష్ మాట్లాడుతూ ఎయిడ్స్ అంటువ్యాధి కాదని చెప్పారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. సీఆర్‌డబ్ల్యూ సీహెచ్ తాయారమ్మ, పాఠశాల హెచ్‌ఎం ఎస్. ఉష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.